https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

తాజా తెలుగు వార్తలు

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

1 PM TO 4 PM

సంపుటి: 01 / సంచిక:25 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / గురువారం, సెప్టెంబర్ 10,2026


హైవే పనులు ఆలస్యంపై

## సిగ్గుపడుతున్నా

ప్రారంభోత్సవానికి నేను రాను: నితిన్ గడ్కరీ

పనాజీ: ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10



ముంబై–గోవా రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగడంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల ఆలస్యంపై తాను సిగ్గుపడుతున్నట్లు చెప్పారు. గోవా రాజధాని పనాజీ సమీపంలోని పోర్వోరిమ్ వద్ద ఆరు లేన్ల ఎలివేటెడ్ రోడ్ కారిడార్‌ను కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం ప్రారంభించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, కేంద్ర మంత్రి శ్రీపాద నాయక్, రాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రి దిగంబర్ కామత్, పర్యాటక శాఖ మంత్రి రోహన్ ఖౌంటే తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.కాగా, ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడారు. ముంబై–గోవా రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'ముంబై–గోవా హైవే పనులు ఇంత ఆలస్యం కావడం నాకు సిగ్గుగా అనిపించింది. అందుకే దాని ప్రారంభోత్సవానికి నేను రానని ముందే ప్రకటిస్తున్నా' అని అన్నారు.మరోవైపు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో జాప్యం, నాసిరకం పనులకు బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై కఠిన చర్యలు చేపడతానని నితిన్ గడ్కరీ హెచ్చరించారు. 'ఒక సంవత్సరంలోపే అత్యధిక సంఖ్యలో కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్ చేసి వారిపై చర్యలు తీసుకుంటా. అధికారులను సస్పెండ్ చేసి ఒక రికార్డు సృష్టించాలనుకుంటున్నా. ఇప్పుడు నేను దీన్ని ఆపబోను' అని అన్నారు.అలాగే అక్టోబర్‌లో ముంబై ఎయిర్‌పోర్ట్‌లో దిగి రోడ్డు మార్గంలో గోవాకు ప్రయాణించి ఆ రహదారిని స్వయంగా తనిఖీ చేస్తానని నితిన్ గడ్కరీ తెలిపారు. ఆ రహదారి ప్రయాణ సౌకర్యవంతంగా ఉందో లేదో అంచనా వేసి చర్యలు తీసుకుంటానని ఆయన వెల్లడించారు.

ఫ్లోటింగ్ సోలార్‌పై

# రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- రిజర్వాయర్లపై ప్లాంట్ల ఏర్పాటుకు కసరత్తు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10:

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సౌర, ఫ్లోటింగ్ సోలార్, ఇతర సంప్రదాయేతర ఇంధన వనరులను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో తెలిపారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుపై విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని అన్నారు. దీనిపై త్వరలో స్పష్టమైన ప్రకటన చేస్తామని ఆయన చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులకు సంబంధించి గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి సోదాహరణంగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రధాన, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల రిజర్వాయర్లలో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల, శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, కొమురంభీం, పాలేరు, వైరా, మల్లన్నసాగర్, ఎల్ఎండీ, మిడ్‌మానేరు, పోచారం వంటి జలాశయాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

సీఎం విజయ్‌పై ఎంకే స్టాలిన్

## తీవ్ర ఆగ్రహం..

అసెంబ్లీని రీల్స్ వేదికగా మార్చారంటూ విమర్శలు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10



తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ముఖ్యమంత్రి విజయ్‌పై డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మీరు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాట్లాడే తీరులో, బాడీ లాంగ్వేజ్‌లో హుందాతనం ఉండాలని, ప్రజలకు మీరే రోల్ మోడల్ అనే విషయాన్ని మరువద్దని ఆయన హితవు పలకారు. ఇటీవల తనను కలిసినప్పుడు తనపై చేసిన విమర్శల గురించి విజయ్ ప్రస్తావించిన విషయాన్ని ఈ సందర్భంగా స్టాలిన్ గుర్తుచేశారు.

## అదుపుతప్పి పెట్రోల్ బంక్‌ను ఢీకొట్టిన బస్సు.. తప్పిన పెను ప్రమాదం

హైదరాబాద్ శివార్లలోని పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

అబ్దుల్లాపూర్‌మెట్ పరిధి బాటసింగారంలో ఘటన

బైక్‌ను తప్పించే క్రమంలో అదుపుతప్పడంతో ప్రమాదం

ప్రమాదంలో కారు, మరో వాహనం, డీజిల్ పంప్ ధ్వంసం

సీసీటీవీ కెమెరాల్లో రికార్డయిన ప్రమాద దృశ్యాలు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

హైదరాబాద్ శివార్లలో టీజీఎస్ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన బస్సు వేగంగా ఓ పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లడంతో అక్కడున్న వాహనాలు, యంత్ర పరికరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదం నుంచి సిబ్బంది, ప్రయాణికులు అదృష్టవశాత్తు ప్రాణాలతో బయట పడటంతో పెను ప్రమాదం తప్పింది.అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాటసింగారం వద్ద గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి చౌటుప్పల్ వైపు వెళుతుండగా, మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న ఒక ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి డ్రైవర్ బస్సును పక్కకు మళ్లించాడు. అయితే, బస్సు అధిక వేగంతో ఉండటంతో నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లింది. మిగతా 2లో...

తుమ్మల నాగేశ్వరరావు పనితీరు, వ్యక్తిత్వంపై

## బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

- ఇతర పార్టీల వారికి కూడా మంచి చేసే నాయకుడు తుమ్మల అన్న పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి
- తుమ్మల అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారని ప్రశంస
- ఏ సమస్యపై ఫోన్ చేసినా వెంటనే స్పందిస్తారని కితాబు

2 లో



## కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

మహిళా పోలీసులతో దురుసు ప్రవర్తన ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు

కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఎఫ్ఐఆర్

అసెంబ్లీ వద్ద చొక్కాలు విప్పి ఇబ్బంది పెట్టారని మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు

భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

తెలంగాణ అసెంబ్లీ వద్ద విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు సహా నలుగురు నేతలపై పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.... మిగతా 2లో...

## ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు :మంత్రి రాజనర్సింహ



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10:

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకంను అమలు చేస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ అంశంపై గురువారం శాసన మండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. జూలై 17 నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చిందని మంత్రి తెలిపారు. చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన నూతన ఈహెచ్ఎస్ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేశామని చెప్పారు. 30 మంది సభ్యులతో ఉన్న ఈ ట్రస్ట్‌లో ఉద్యోగ సంఘాల నుంచి 10 మంది, పెన్షనర్ సంఘాల నుంచి 3 మంది, ప్రభుత్వం నుంచి 16 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు.నెలకు రూ.88 కోట్ల నిధులుఉద్యోగులు, పెన్షనర్లు తమ బేసిక్ పే/చివరిగా పొందిన పెన్షన్‌లో 1.5 శాతం చొప్పున నెలకు చెల్లిస్తుండగా, అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా ఇస్తోందని మంత్రి తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి నెలకు రూ.44 కోట్లు, ప్రభుత్వం నుంచి మరో రూ.44 కోట్లు కలిపి నెలకు రూ.88 కోట్లు సమకూరుతున్నాయని చెప్పారు. ఈ పథకానికి ఏడాదికి రూ.1,056 కోట్ల బడ్జెట్ ఉందని తెలిపారు. మిగతా 2లో...



# చాకలి ఐలమ్మ పోరాటాలు, త్యాగాలు చిరస్మరణీయం : కేటీఆర్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి చోసం తిరుగుబాటు చేసిన చాకలి ఐలమ్మ పోరాటాలు, త్యాగాలు చిరస్మరణీయం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి (చిట్యాల) ఐలమ్మ చూపించిన తెగువ తెలంగాణ ధీరత్వానికి తార్కాణం, బహుజన పోరాట పటిమకు ప్రతీక అని తెలిపారు. చాకలి ఐలమ్మ గొప్పతనాన్ని చాటిచెప్పే విధంగా కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ఐలమ్మ జీవిత చరిత్రను పాఠశాల విద్యలో పాఠ్యాంశంగా చేర్చింది. అలాగే కేసీఆర్ పాలకుర్తి మార్కెట్ యార్డుకు ఐలమ్మ పేరు పెట్టారు. వారి జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారని గుర్తు చేశారు. నేడు వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పించారు.

మొదటిపేజీ తరువాయి

## తుమ్మల నాగేశ్వరరావు పనితీరు, వ్యక్తిత్వంపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు.ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు.ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని, ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారని పేర్కొన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

మొదటిపేజీ తరువాయి

## కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

వివరాల్లోకి వెళితే.. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గేట్ నెం.3 వద్ద మహిళా కానిస్టేబుళ్లు భద్రతా విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో రాజకీయ నినాదాలున్న నల్ల టీ-షర్టులు ధరించి, ప్లకార్డులతో కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు అక్కడికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం అలాంటి దుస్తులు, వస్తువులకు అనుమతి లేదని పోలీసులు చెప్పగా, బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడారని మహిళా కానిస్టేబుల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.హరీశ్‌రావు, కేటీఆర్ తమను అవమానకర రీతిలో దూషించారని ఆమె తెలిపారు. హరీశ్‌రావు తన టీ-షర్టును విప్పి ఓ పోలీసు అధికారిపైకి విసిరి, మహిళా సిబ్బంది ముందే అర్ధనగ్నంగా నిలబడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా అదే విధంగా ప్రవర్తించి, తమకు తీవ్ర ఇబ్బంది కలిగించారని ఫిర్యాదులో వివరించారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం వంటి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

## అదుపుతప్పి పెట్రోల్ బంక్‌ను ఢీకొట్టిన బస్సు..

ఈ ప్రమాదంలో బంక్‌లో ఆగి ఉన్న ఒక కారు పూర్తిగా ధ్వంసం కాగా, మరో వాహనం పాక్షికంగా దెబ్బతింది. బస్సు నేరుగా డీజిల్ ఫిల్లింగ్ పాయింట్‌ను ఢీకొట్టడంతో అక్కడి యంత్ర పరికరాలు ఛిన్నాభిన్నమయ్యాయి. ఓ పెట్రోల్ పంప్ ఎగిరిపడింది. ఒక్కసారిగా బస్సు దూసుకురావడంతో పెట్రోల్ బంక్ సిబ్బంది, వాహనదారులు భయాందోళనలతో పరుగులు తీశారు. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలన్నీ అక్కడ ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి.

మొదటిపేజీ తరువాయి

## ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు :మంత్రి రాజనర్సింహ

**921 ఆసుపత్రుల్లో వైద్యం**

నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద 921 ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఇందులో 114 ప్రభుత్వ, 807 ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయని చెప్పారు.

**37 వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు**

ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఓపీ వైద్యం, వైద్య పరీక్షలు, మందులు అందించేందుకు ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ కేంద్రాలు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. మరో 25 వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఇందులో 21 జిల్లాల్లో, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరిలో అధిక రద్దీ ఉన్న ప్రాంతాల్లో మరో 4 కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీంతో మొత్తం వెల్‌నెస్ కేంద్రాల సంఖ్య 37కు చేరుతుందని చెప్పారు. ఇప్పటివరకు 8,511 కేసులకు రూ.55.14 కోట్లుపథకం ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకు 8,511 కేసులకు రూ.55.14 కోట్ల ప్రీ-ఆథరైజేషన్ ఇచ్చామని మంత్రి తెలిపారు. 17 లక్షలకు పైగా లబ్ధిదారులునూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం పరిధిలో 17 లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారని మంత్రి తెలిపారు. అర్హులైన వారికి డిజిటల్ ఆరోగ్య కార్డులను వెబ్ పోర్టల్ ద్వారా జారీ చేస్తున్నామని చెప్పారు. ఓటీపీ ద్వారా స్వయంగా హెల్త్ కార్డును డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. అందరికీ హెల్త్ కార్డులు ఇస్తామని, ఉద్యోగులు కోరుకున్న విధంగా ఆరోగ్య సేవలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని యువత కొనసాగించాలి: మంత్రి వాకిటి శ్రీహరి

### అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటమే ఐలమ్మకు నిజమైన నివాళి

### రవీంద్రభారతిలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్



రవీంద్ర భారతి, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10:

ప్రజా ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి దిశగా తీసుకెళ్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బహుజనుల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహనీయురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు వి.హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చాకలి ఐలమ్మ సేవలను, పోరాట స్ఫూర్తిని గౌరవిస్తూ మెడికల్ కాలేజీకి ఆమె పేరు పెట్టామని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణనలో బీసీల జనాభా లెక్కలను కూడా తేల్చాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం జరగాలంటే కచ్చితమైన గణాంకాలు అవసరమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వంటి మహనీయుల ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ బహుజనుల కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం చేసిన గొప్ప నాయకురాలని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సామాజిక అన్యాయాన్ని, దోపిడీని, పెత్తందారీ వ్యవస్థను ఎదిరించి పేదలు, బలహీన వర్గాల పక్షాన నిలిచిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు.

మొదటిపేజీ తరువాయి

## సీఎం విజయ్‌పై ఎంకే స్టాలిన్ తీవ్ర ఆగ్రహం..

ఎమర్జెన్సీ కాలంలో, మీసా చట్టం కింద కరుణానిధి మెరీనా బీచ్‌లో భారీ నిరసన చేపట్టిన చరిత్రను స్టాలిన్ గుర్తుచేశారు. ఆ సమయంలో డీఎంకే ప్రభుత్వాన్ని రద్దు చేశారని, తనను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ఇంటికి వస్తే.. "నా కొడుకు వస్తాడు, వచ్చి అరెస్ట్ చేయండి" అని కరుణానిధి ధైర్యంగా చెప్పారని తెలిపారు. పదేళ్లు ఒకే సెల్‌లో ఉండి, సరైన వసతులు లేక ఇబ్బందులు పడ్డామని, పోలీసుల చిత్రహింసల కారణంగా తన ప్రాణ స్నేహితుడు చిట్టి బాబు మరణించాడని, తన దవడ పగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము కేవలం పదవుల కోసం కాకుండా తమిళుల హక్కుల కోసం పోరాడిన చరిత్ర కలిగిన వారమని స్పష్టం చేశారు. అన్నా కాలం నాటి డీఎంకే చరిత్ర అసెంబ్లీ లైబ్రరీలో రికార్డు అయి ఉందని ఆయన పేర్కొన్నారు.డీఎంకే హయాంలో నిర్మించిన వంతెనల వద్ద ఫొటోషూట్లు చేసుకుంటూ, అసెంబ్లీని 'రీల్స్' కేంద్రంగా మార్చేశారని స్టాలిన్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు రీల్స్‌తో యువతరాని మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, పరంజూర్ విమానాశ్రయం రద్దు వల్ల తమిళనాడు అభివృద్ధి 15 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మహిళలకు ఇచ్చిన రూ.2,500 హామీ ఇప్పటికీ రూ.1,000గానే ఉందని, సిలిండర్ల పంపిణీలోనూ కోతలు పెట్టారని, రైతుల రుణ మాఫీ సరిగ్గా జరగలేదని దుయ్యబట్టారు.మార్పు కోసమే ఓటు వేసిన యువత.. ఇదేనా తాము కోరుకున్న అసలైన మార్పు అని ప్రశ్నించుకోవాలని స్టాలిన్ సూచించారు. ప్రభుత్వం తప్పులు చేసి ప్రజలను ఇబ్బంది పెడుతుంటే నిర్లక్ష్యంగా ఉండకూడదని, మన సిద్ధాంతం అది కాదని స్పష్టం చేశారు. ఏ నాణేనికైనా రెండు వైపులా ఉన్నట్టే, అధికారంలో ఉన్నా లేకపోయినా తమిళనాడు అభివృద్ధి కోసం మనం నిరంతరం పోరాడుతూనే ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. వివాదాస్పద అంశాలను పక్కనబెట్టి, అసెంబ్లీలో తమిళుల హక్కులు, రాష్ట్ర అభివృద్ధిపై చర్చించాలని స్టాలిన్ డిమాండ్ చేశారు.

మొదటిపేజీ తరువాయి

## రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**అదనపు వ్యయమే ప్రధాన సవాల్:**

సాధారణ సోలార్ ప్రాజెక్టులతో పోలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు అధిక వ్యయం అవుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద మెగావాట్‌కు రూ.కోటి వరకు సహాయం అందించే పథకాన్ని ప్రకటించినప్పటికీ అందులో కొన్ని ఇబ్బందులున్నాయని చెప్పారు. ప్రధానంగా దేశీయంగా తయారైన పరికరాలనే ఉపయోగించాలనే కేంద్ర నిబంధనల కారణంగా మెగావాట్‌కు సుమారు రూ.1.30 కోట్ల వరకు అదనపు భారం పడుతోందని వివరించారు. కేంద్రం విధించిన నిబంధనలను సడలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులపై పెట్టుబడిదారుల్లో మరింత ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులను ప్రోత్సహించి ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోందని ఆయన శాసనసభకు చెప్పారు.

**18,543 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్:**

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని శాసనసభకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 2023 డిసెంబర్‌లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ సుమారు 15 వేల మెగావాట్లు ఉండగా.. సెప్టెంబర్ 9 నాటికి అది 19వేల మెగావాట్లకు చేరిందని చెప్పారు. పారిశ్రామిక వృద్ధి, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వంటి కారణాలతో విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని ఆయన వివరించారు. పెరుగుతున్న డిమాండ్ రాష్ట్ర అభివృద్ధికి సానుకూల సంకేతమే అయినప్పటికీ, అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.

**ఏడాదికి రూ.19 వేల కోట్ల సబ్సిడీ:**

వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.14 వేల కోట్ల సబ్సిడీ భరిస్తోందని డిప్యూటీ సీఎం చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా సుమారు 55 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కల్పిస్తున్నామన్నారు. దీనికి మరో రూ.5 వేల కోట్ల వరకు వ్యయం అవుతోందన్నారు. మొత్తంగా దాదాపు రూ.19 వేల కోట్లను ఏటా విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం వెచ్చిస్తోందని ఆయన సభకు తెలిపారు. భవిష్యత్తులో ఈ భారాన్ని తగ్గించుకుంటూనే ప్రజలకు ఉచిత విద్యుత్ అందించే విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం సోలార్ విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నామన్నారు.

**80 గ్రామాల సోలరైజేషన్:**

అమ్రాబాద్ గిరిజన ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భట్టి విక్రమార్క వెల్లడించారు. సుమారు 80 గ్రామాలను పూర్తిగా సోలరైజ్ చేసి, అక్కడ మైక్రో గ్రిడ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి, మైక్రో గ్రిడ్ ద్వారా విద్యుత్ వినియోగించే విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నామన్నారు.

**ఇందిరా సౌర గిరి జల వికాసం:**

గిరిజన ప్రాంతాల్లో భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ కింద గతంలో పంపిణీ చేసిన సుమారు 6.70 లక్షల ఎకరాలను కూడా సౌర విద్యుత్ ప్రోత్సాహానికి వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పేరుతో పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అవకాశం ఉన్నచోట సోలరైజేషన్, ఫ్లోటింగ్ సోలార్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టులు, ముఖ్యంగా మంథని నియోజకవర్గంలోని కాటారం, మహాముత్తారం వంటి ప్రాంతాల్లోనూ అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సాధ్యమైనంత మేరకు ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

**సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతులు ముందుకు రావాలి:**

రైతులు, ప్రజలు సౌర విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన పెంచుకోవాలని భట్టి విక్రమార్క కోరారు. తమ తమ గ్రామాల్లో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రైతులకు ఎమ్మెల్యేలు అవగాహన కల్పించాలని సూచించారు. పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చేలా ప్రజలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యేలకు ఉప ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

## బ్రిక్స్ సదస్సుకు భారీ భద్రతా ఏర్పాట్లు..

### 500 సీసీటీవీ కెమెరాలు.. 7,000 మంది భద్రతా సిబ్బంది



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు10

దేశరాజధాని ఢిల్లీ నగరం బ్రిక్స్ సదస్సుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 18వ బ్రిక్స్ సదస్సు ఢిల్లీలో సెప్టెంబర్ 12, 13వ తేదీల్లో జరగనుంది. 11వ తేదీ నుంచే అతిథులు రానున్నారు. అక్కడి భారత్ మండపంలో జరగనున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ వంటి నేతలు హాజరవుతున్నారు.అందుకే భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సదస్సు జరిగే ప్రాంతాలతోపాటు, అతిథులు బస చేసే హోటళ్ల వద్ద కనీవిని ఎరుగని భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 500 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. 7,000 మంది భద్రతా సిబ్బందిని నియమించారు. వీరిలో ఢిల్లీ పోలీసులతోపాటు పారామిలిటరీ దళాలు, ఎన్ఎస్‌జీ, ఐబీ, ఇతర విభాగాలకు చెందిన సిబ్బంది పని చేస్తున్నారు. మరోవైపు అంతర్జాతీయ అతిథులు వస్తున్నందున ఢిల్లీ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సుందరీకరణ బాధ్యతలు చేపట్టారు. 15,000కుపైగా పూల మొక్కల్ని ఏర్పాటు చేశారు.బ్రిక్స్ సదస్సుకు ప్రధాని మోదీ నేతృత్వం వహిస్తారు. పుతిన్, జిన్‌పింగ్, పెజెష్కియాన్‌తోపాటు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా వంటి నేతలు హాజరవుతున్నారు. బ్రెజిల్, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ వంటి 11 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, సహకారం, రవాణా, సరఫరా, టెక్నాలజీ వంటి అంశాలపై చర్చలు, ఒప్పందాలు ఉంటాయి. ఇండియా ఈ సదస్సు నిర్వహిస్తుండటం ఇది నాలుగోసారి. గతంలో 2012, 2016, 2021లో బ్రిక్స్ సదస్సు నిర్వహించింది.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136